ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 16 జనవరి 2025





రాయచోటిలో ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి పట్టణంలోని రామాపురం చిట్లా కుప్ప వద్ద జనం





నందలూరులోని చెయ్యేరు నదిలో జరుగుతున్న ఎద్దబండ్ల పోటీలు... భారీగా హాజరైన జనం



కలకడలో పశువులకు రంగురంగుల బెలూన్లతో అందంగా ముస్తాబు




పెద్దమండ్యం బ్రాహ్మణవీధిలో ఎద్దులను ఊరేగిస్తున్న దృశ్యం



సంబరాలే.. సంబరాలు..

- కన్నుల పండువగా కనుమ
- పలుచోట్ల ఎద్దుల బండలాగుడు పోటీలు
- పశువులకు అలంకరణలు.. చిట్లాకుప్పకు నిప్పు
- పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు



అశేష జనవాహిని మధ్య పీలేరు కామాటంవారిపల్లెలో కాలుతున్న చిట్లాకుప్ప

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. పల్లె.. పట్నం తేడా లేకుండా ఏ ఇంట్లో చూసినా బంధువులు, స్నేహితులతో పండుగను సంతోషంగా జరుపుకున్నారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా సంబరాలు మిన్నంటాయి. జిల్లాలో పలు చోట్ల పండుగ కోసం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎద్దులు, ఆవులు, ఎనుములు పశువులను సుందరంగా అలంకరించి బుధవారం సాయంత్రం కాటమరాజుకు పూజ చేసి చిట్లాకుప్పకు నిప్పు పెట్టారు. పశువులను ఉత్సాహంగా ఊరేగించారు. రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని దాదాపు అన్ని పల్లెల్లోనూ పండుగను వైభవంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రం రాయచోటి మున్సిపాలిటీ పాతరాయచోటి పట్టణంలో స్థానిక టీడీపీ నాయకులు పదిలం శివ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రజల కోసం ఇటువంటి పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం ఎడ్ల బండలాగుడు పోటీలలో గెలుపొందిన విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మునిసిపాలిటీ పరిధిలో పలు చోట్ల ప్రజలు చిట్లాకుప్పలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కొత్తపేట రామాపురంలో ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప వద్దకు వేల సంఖ్యలో ప్రజలు హాజరై సంబరాల్లో పాల్గొన్నారు. చిట్లాకుప్ప చుట్టూ పలువురు పశువులను ఊరేగించారు. పట్టణంలోని కొత్తపేట, రామాపురం, హరినాధవీధి, బోస్ నగర్, సరస్వతినగర్, దూదేకులపల్లె, లక్ష్మీపురం ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ చిట్లాకుప్ప వద్దకు హాజరయ్యారు. కార్లు, ద్విచక్రవాహనాల్లో పెద్ద ఎత్తున జనాలు రావడంతో.. కొత్తపేట రామాపురం ప్రధాన రహదారి కిటకిటలాడింది. చిట్లాకుప్పలో అనపకాయలు, గుమ్మడికాయలు వేశారు. చిట్లా కుప్ప వద్ద టెంకాయలు కొట్టి పలువురు పూజలు చేశారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నందలూరు వద్ద చెయ్యేరు నదిలో కనుమ పండుగ సందర్భంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఇసుకలో ఎడ్లబండ్ల పోటీల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఏరంతా జనంతో నిండిపోయారు.

పీలేరు పట్టణంలో కామాటంవారిపల్లె, కట్టుకాలువ వీధి, కావలిపల్లె ప్రాంతాల్లో బుధవారం చిట్లాకుప్ప కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. పశువుల యజమానులు తమ పశువులను సుందరంగా అలంకరించుకుని ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన చిట్లాకుప్పల వద్దకు తోడ్కొని వచ్చారు. ఎద్దులు, ఆవులకు సుందరంగా అలంకరించిన బుడ్డలు, పూలను తెంపేందుకు యువకులు పోటీలు పడుతుండగా వారి హడావిడికి భయపడి అటూ ఇటూ పరుగెత్తుతున్న పశువులతో ఆయా చిట్లాకుప్ప ప్రాంగణాలు సందడిగా మారాయి.



కురబలకోట మండలం అంగళ్లులో చిట్లాకుప్ప వద్దకు తరలివచ్చిన పశువులు



తంబళ్లపల్లెలో పశువులను చిట్లాకుప్ప చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తున్న రైతులు



గుర్రకొండలోని అరిగెలవారిపల్లెలో కాలుతున్న చిట్లా కుప్ప



పీలేరు కావలిపల్లె వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కర్ణాటక కళాకారులు

ఉద్యోగం చేస్తావనుకుంటే..నూరేళ్లు నిండాయా..

- క్వారీలో పడి యువకుడి మృతి
- శోకసంద్రంలో చొక్కన్నవారిపల్లె



వెంకటరమణ (ఫైల్)

గుర్రంకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాడు. అక్కడ ఇంజనీరింగ్ విద్యలో మాస్టర్ ఆఫ్ డిగ్రీ పొందాడు. ఈ నేపథ్యంలో కోర్సును పూర్తి చేసుకుని ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మరో పదిహేను రోజుల్లో యూకే వెళ్లాల్సి ఉంది. ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని ఉన్నతస్థితిలోకి తీసుకెళదామనుకునేలోపే ఈత రూపంలో మృత్యువు కబళించింది. చేతికొచ్చిన కుమారుడు తమను ఉన్నత స్థితికి చేరుస్తాడనుకొంటే చేతికందనంత దూరం వెళ్లిపోయావా అంటూ తల్లిదండ్రులు భోరున విలపించారు. కలకడ మండలం గుడిబండ పంచాయతీ చొక్కన్నవారిపల్లెకు చెందిన బోను సూరి కుమారుడు బోను వెంకటరమణ (24) ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఈ క్రమంలో ఉన్నత చదువుల్లో భాగంగా యూకే దేశంలో ఇంజనీరింగ్ మాస్టర్ ఆఫ్ డిగ్రీ పొందాడు. కోర్సు పూర్తి కావడంతో ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. మరో పదిహేను రో జుల్లో ఉద్యోగం కోసం యూకే వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సంక్రాంతి సందర్భంగా స్నేహితులతో కలిసి గుర్రంకొండ మండలం చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లె వద్ద ఉన్న క్వారీలో ఈతకు వచ్చారు. స్నేహితులతో కలిసి ఈత ఆడుతుండగా వెంకటరమణ పై నుంచి దూకాడు. ఎంతసేపటికీ వెంకటరమణ బయటకు రాలేదు. గమనించిన స్నేహితులు చాలా స మయం వెతికినా కనబడలేదు. దీంతో విషయాన్ని తల్లిదండ్రులకు, బంధువులకు తెలిపారు. అలాగే విషయాన్ని పోలీసులకు చెప్పడంతో రెస్క్యూ టీంను పిలిపించారు. మృతదేహం కోసం రెస్క్యూ టీం గాలిస్తోంది. చీకటి పడడంతో వెంకటరమణ మృతదేహాన్ని వెలికితీయడానికి కుదరలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ రామచంద్రుడు తెలిపారు.



మృతదేహం కోసం వెతుకుతున్న రెస్క్యూ టీం

అంకాలమ్మ తల్లికి చద్దన్నం నైవేద్యం



అంకాలమ్మకు నైవేద్యంగా సమర్పించిన చద్ది అన్నపు కుంభం



అలంకరణలో అమ్మవారు

రాజంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వేడుకలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా నిర్వహించారు. అందులో భాగంగా పెనగలూరు మండలం వెలగచర్ల గ్రామం అంకాలమ్మ దేవతకు ఆ గ్రామస్థులు తరతరాలుగా చద్ది అన్నపు నైవేద్యాన్ని పెట్టి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామస్థులంతా పాల్గొని అమ్మవారికి చద్ది అన్నాన్ని పెట్టి ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. సంక్రాంతి సందర్భంగా కనుమ పండుగ రోజు గ్రామస్థులందరూ అత్యంత భక్తి విశ్వాసాల మధ్య అమ్మవారికి చద్ది అన్నపు చలువను పెట్టారు. ప్రతి ఇంటిలో తయారు చేసిన చద్ది అన్నాన్ని అంకాలమ్మ గుడి ఎదుట కుంభంగా పోసి అందరూ నైవేద్యం స్వీకరించారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకుంటూ ఈ వేడుకలు నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న వెలగచర్ల గ్రామస్థులు

అక్షితను అభినందిస్తున్న బంధువులు తల్లిదండ్రులు



రైఫిల్ షూటింగ్‌లో ఉత్తమ ప్రతిభ

- తెలంగాణలో జరిగిన పోటీల్లో గోల్డ్‌మెడల్
- విద్యార్థినిని ప్రశంసించిన బంధువులు, ప్రముఖులు

సుండుపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుర్రలదిన్నెపల్లెకు చెందిన భూమారపు అక్షిత తెలంగాణాలో ఈనెల 1వ తేదీ నిర్వహించిన సీఎం కప్ టోర్నీలో 10 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో 400 పాయింట్లకు గాను 399 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించింది. త్వరలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదగా గోల్డ్ మెడల్ అందుకోనుంది. ఈ సందర్భంగా వారి స్వగ్రామం బుర్రలదిన్నెపల్లెలో బుధవారం బంధువులతో కలసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందరంగా గోల్డ్‌మెడల్ విజేత అక్షిత మాట్లాడుతూ తన తండ్రి భూమారపు మోహన్ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ట్రాన్స్‌లేటర్‌గా పనిచేస్తున్నారని, తాను హైదరాబాద్‌లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నానని, రైఫిల్ షూటింగ్‌లో ఒలింపిక్స్‌లో రాణించడమే లక్ష్యంగా కోచింగ్ తీసుకుంటున్నానని తెలిపింది. కార్యక్రమంలో విశ్రాంత ఆధ్యాపకులు సుబ్బరాజు, బంధువులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేధింపులు భరించలేక
కన్న కుమారుడినే కడతేర్చారు..

- కువైట్ నుంచి వచ్చి హత్య చేసిన తండ్రి



హత్యకు గురైన చరణ్‌రాజు

రాజంపేట టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా తల్లిదండ్రులు బిడ్డలను కని వారు ఉన్నత స్థానానికి చేరుకుంటే తనివితీరా చూసి ఆనందంగా ఉండాలని కోరుకుంటారు. అటువంటిది యుక్త వయస్సుకు వచ్చిన కుమారుడి వేదింపులు తాళలేక కన్న తల్లిదండ్రులే హత్య చేశారు. మన్నూరు సీఐ ఎస్‌ఎం అలీ అందించిన వివరాలిలా ఉన్నాయి. రాజంపేట మండలం పోలి గ్రామానికి చెందిన చరణ్‌కుమార్‌రాజు (19) అనే కుమారుడిని తండ్రి లక్ష్మీనరసరాజు, తల్లి జి.లలితమ్మ హత్య చేసినట్లు తెలిపారు. పోలి గ్రామంలోని గౌనిపురం లక్ష్మీనరసరాజు, లలితమ్మ దంపతులకు ఇరువురు కుమారులు. వారిలో చరణ్‌కుమార్‌రాజు పెద్దకొడుకు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయి ప్రస్తుతం రాజంపేటలోని ఓ మోటారు వెహికల్ షోరూంలో పని చేస్తున్నాడు. అతడి తండ్రి లక్ష్మీనరసరాజు 18ఏళ్లుగా కువైట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య లలితమ్మ పోలి గ్రామంలో నివాసం ఉంది. పెద్ద కుమారుడు చరణ్‌కుమార్‌రాజు చెడు అలవాట్లకు లోనై తల్లిపైనే అనుమానం వ్యక్తం చేస్తూ నలుగురిలో అవమానించే విధంగా ప్రవర్తించేవాడు. అతడి వేధింపులు భరించలేక ఆ తల్లి కువైట్‌లో ఉన్న తన భర్తకు ఫోన్ చేసి బార్య తెలిపింది. దీంతో లక్ష్మీనరసరాజు ఈనెల 12వ తేదీ రాత్రి కువైట్ నుంచి ఇంటికి చేరుకున్నాడు. 13వ తేదీ చరణ్‌కుమార్‌రాజు మద్యం తాగి ఇంటిగేటు దగ్గర తాగిన మైకంలో కిందపడిపోగా తల్లిదండ్రులు అతడిపి ఇంటిలోకి తీసుకవచ్చి మందలించారు. అయితే తల్లిదండ్రులను లెక్కచేయకుండా వారిని ఎదిరించాడు. 14వ తేదీ రాత్రి ఒంటిగంట సమయంలో కుమారునికి, తల్లిదండ్రులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరగ్గా తల్లిదండ్రులిద్దరూ కుమారుడి గొంతుకు గట్టిగా గుడ్డ పెట్టి ఊపిరి ఆడకుండా బిగించి హత్య చేశారు. అయితే అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామంలో తెలిపారు. మృతుడు చరణ్‌కుమార్‌రాజు తాత వెంకటనరసరాజు ఇది హత్యగా ఫిర్యాదు చేయడంతో అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్వాపరాలు విచారించి కుమారుడిని తల్లిదండ్రులే హత్య చేసినట్లు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ అలీ తెలిపారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

- 25 టన్నుల రేషన్ బియ్యం బెంగళూరుకు తరలింపు?
- వదిలేయాలని ఒక వర్గం.. కేసు నమోదు చేయాలని మరో వర్గం
- అధికార పార్టీ నేతల నుంచి పోలీసులు, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి
- రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని వదిలేసిన పోలీసులు



గుర్రంకొండ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం లారీ

గుర్రంకొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం అధికార పార్టీ నేతల సహకారంతో పక్క రాష్ట్రాలకు తరలిపోతోంది. పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం నాయకుల పొట్ట నింపుతోంది. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని నాయకులు తమ అనుచరుల ద్వారా సేకరిస్తున్నారు. ఈ రేషన్ బియ్యాన్ని ఓ చోటకు చేర్చి 25 కిలోలు, 50 కిలోల సంచుల్లో నింపుతున్నారు. ఈ రేషన్ బియాన్ని లారీల్లో పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ రేషన్ బియ్యం అక్రమ వ్యాపారులకు జిల్లాకు చెందిన అధికార పార్టీలోని ఓ నాయకుడి అండదండలు పుష్కలంగా ఉండటంతో జిల్లాలోని రైస్‌మిల్ వ్యాపారులందరూ ఆయన కనుసన్నల్లోనే బియ్యం వ్యాపారం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయనను కాదని వ్యాపారం చేస్తే వారిపై కేసులు నమోదు చేసి రేషన్ బియ్యాన్ని సీజ్ చేయిస్తారని, రేషన్ బియ్యం వ్యవహారం చక్కబెట్టడానికి ఆయన ఇద్దరు నాయకులను నియమించినట్లు తెలిసింది. ఈ ఇద్దరే కడప, అన్నమయ్య జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాయచోటి నుంచి రేషన్ బియ్యం లోడ్‌తో లారీ బుధవారం తెల్లవారుజామున బయలుదేరింది. ఈ లారీ కదలికలను గమనిస్తూ అధికార పార్టీకి చెందిన ఆ పెద్ద నాయకుడి వ్యతిరేక వర్గంలోని కొందరు ఎలాగైనా రేషన్ బియ్యాన్ని పోలీసులకు పట్టించాలని వెంబడిస్తూ వచ్చారు. ఆ లారీ గుర్రంకొండకు చేరుకోగానే పోలీసులకు సమాచారం ఇచ్చి మార్కెట్ యార్డు సమీపంలో ఉదయం 4.20 గంటలకు పట్టించారు. దీంతో పోలీసులు ఆ లారీని స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. వెంటనే సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఉదయం 9 గంటల తరువాత సీఎస్‌డీటీ గుర్రంకొండకు చేరుకుని రేషన్ బియ్యం లారీని పరిశీలించారు. అప్పుడే మొదలైంది అధికారులకు అసలు ఆట. రేషన్ బియ్యం లారీని వదిలేయాలంటూ ఆ పెద్ద నాయకుడి తమ్ముడి నుంచి పోలీస్‌లకు ఫోన్.. ఆ ఫోన్ పెట్టగానే లారీని సీజ్ చేసి కేసు నమోదు చేయాలని అధికార పార్టీలోని మరో నాయకుడి నుంచి ఫోన్ కాల్. ఈ ఫోన్ కాల్స్‌తో అటు రెవెన్యూ, ఇటు పోలీస్ అధికారులు ఉక్కిరిబిక్కిరైపోయారు. రేషన్ బియ్యం లారీ సీజ్ విషయం గుర్రంకొండలో సాయంత్రం వరకు హైడ్రామా నడిచింది. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని తెలిసినా ఆ పెద్ద నాయకుడికే అధికారులు వత్తాసు పలికి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. లారీ సీజ్ కాకుండా చేసి పెద్దనాయకుడు తమ అనుచరులను గట్టునేసుకొని పరువు కాపాడుకున్నాడు. ఈ విషయమై ఎస్‌ఐ మధు రామచంద్రుడును వివరణ కోరగా అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు తెలియడంతో లారీని ఉదయం స్వాధీనం చేసుకున్నాం. రేషన్ బియ్యం లారీకి సంబంధించి రికార్డులను పరిశీలించాం. బియ్యం తరలించడానికి కావాల్సిన అనుమతులు, రికార్డులు ఉండడంతో పట్టుకున్న లారీని పంపేశాం.

సబ్సిడీ రుణాలకు తెరుచుకోని వెబ్‌సైట్

● వరుస సెలవులతో మంజూరు కాని ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు

● అయోమయంలో ఆశావహులు ● నేటితో ముగియనున్న గడువు... పెంచాలంటూ విజ్ఞప్తి


పీలేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు' అన్నట్లుగా మారింది జిల్లాలోని స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈనెల 7వ తేదీ జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. అయితే అప్పటి నుంచి సంబంధిత పోర్టల్ తెరుచుకోకపోవడంతో పాటు రుణాల దరఖాస్తు కోసం కావాల్సిన ధృవీకరణ పత్రాలు సైతం సకాలంలో అందక చాలామంది నిరుద్యోగులు అయోమయంలో ఉన్నారు. ఒకవైపు రుణాల దరఖాస్తు కోసం ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగిసిపోతున్నా, సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి సానుకూల సమాధానం లేకపోవడంతో వారందరూ నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆ పోర్టల్ తెరుచుకోవడం లేదని, దరఖాస్తు ఆఖరు గడువును పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం భారీ నోటిఫికేషన్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రంగంలో ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7వ తేదీ అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో 1964 యూనిట్ల స్థాపన కోసం నోటిఫికేషన్ వెలువరించింది. అందులో జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 1350 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 67 యూనిట్లు, కమ్మ కార్పొరేషన్ ద్వారా 10 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 69 యూనిట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 14 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 13 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 379 యూనిట్లు, కాపు ఎంఎస్ఎంఈ గ్రూపు రుణాలు 3 యూనిట్లు మంజూరు చేశారు. వీటిలో యూనిట్ ఖరీదు రూ.5 లక్షలు కాగా, 50 శాతం సబ్సిడీ ఉంటుంది. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణంగా లభిస్తుంది. అవి కాకుండా జనరిక్ మందుల షాపుల కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా 30 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 9 యూనిట్లు, కమ్మ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 11 యూనిట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 1 యూనిట్ మంజూరు చేశారు. జనరిక్ మెడిసిన్ దుకాణం యూనిట్ ఖరీదు రూ.8 లక్షలు కాగా సబ్సిడీ రూ.4 లక్షలు, బ్యాంకు రుణం రూ.4 లక్షలు లభిస్తుంది.

నేటితో ముగియనున్న గడువు

రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ లోపు తమ ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరీ సిస్టం (ఏపీఓబీఎంఎంఎస్) అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహణ సంచాలకులు శిరీషా తన ప్రకటనలో తెలిపారు. అయితే ఆరోజు నుంచి బుధవారం రాత్రి వరకు కూడా ఆ వెబ్‌సైట్ పూర్తిగా తెరుచుకోలేదని ఆశావహులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా



'కమింగ్ సూన్' అంటూ చూపుతున్న ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్

'కమింగ్ సూన్' అని మాత్రమే కనిపిస్తోందని, అంతకు మించి ఎటువంటి సమాధానం రావడం లేదని వారు వాపోతున్నారు. దానికితోడు రెవెన్యూ సదస్సులు, వరుస సెలవుల కారణంగా రెవెన్యూ అధికారులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల మంజూరులోనూ విపరీతమైన జాప్యం చేశారని వారు తెలిపారు. వాటి కారణంగానూ తాము దరఖాస్తు చేసుకోలేకపోయామని వారు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. గడువును మరో 10 రోజులు పెంచాలని, ఏపీఓబీఎంఎంఎస్ వెబ్ సైట్‌ను పూర్తిగా అందుబాటులోకి తేవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండడంతో ఎంత మంది దరఖాస్తు చేశారో స్థానిక అధికారులకు తెలియడం లేదు. ఒకరిద్దరు ఆశావహులు మాత్రం తమకు ఫోన్ చేసి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు తెలియజేశారని వారు చెబుతున్నారు.

బాలసాహిత్యం విజ్ఞానానికి సోపానం



చిట్టిచేతులు బాలల కథల పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలసాహిత్యం విజ్ఞానానికిసోపానం అని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. తెలుగు భాషోపాధ్యాయులు పల్లా వెంకటరామారావు రచించిన చిట్టిచేతులు పుస్తకావిష్కరణ బుధవారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ బాలల కథలు పిల్లలకు ప్రపంచజ్ఞానాన్ని, మంచి, చెడు విచక్షణను తెలియజేస్తాయన్నారు. బాలలకోసం రచయిత చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ పిల్లలను నైతిక విలువల అభివృద్ధికి, సమాజం పట్ల అవగాహనకు, మంచి నడవడికకు బాలల కథలు తోడ్పడుతాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహిత డీకే చదువులబాబు మాట్లాడుతూ పిల్లలతో బాల సాహిత్యం చదివించడం వలన వారిలో మంచి అలవాట్లను పెంపొందించవచ్చునని తెలిపారు. రచయిత పల్లా రామారావు మాట్లాడుతూ నేటితరం పిల్లలు బాలసాహిత్యాన్ని చదవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కవి ఏసీ దస్తగిరి, రచయితలు కొమ్మిశెట్టి మోహన్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, జింకా సుబ్రమణ్యం, కొత్తపల్లె శ్రీను, బండారు రఘురామయ్య, పల్లా శేషయ్య, బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన సినిమా ప్రదర్శన.. ప్రేక్షకుల ఆందోళన

కడప క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలోని గ్రూప్ థియేటర్లలో వెంకటేశ్, ఐశ్వర్యారాజేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ప్రదర్శన ఓ హాలులో జరిగింది. అరగంట తరువాత టెక్నికల్ ఇష్యూతో సినిమా ప్రదర్శన ఆగిపోయింది. దీంతో ప్రేక్షకులు హాలు ఎదుట ఆందోళనకు దిగారు. డబ్బు చెల్లించాలంటూ థియేటరు యాజమాన్యంతో వాగ్వావాదానికి దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రేక్షకులకు సర్దిచెప్పే యత్నం చేశారు. తాము చెల్లించిన డబ్బు వెనక్కి ఇవ్వాలని డిమండ్ చేశారు. దీంతో హాలు యాజమాన్యం టికెట్ కొనుగోలు చేసిన వారికి డబ్బు చెల్లించారు. ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేసిన వారికి మొదట ఇవ్వకపోవడంతో తరువాత పోలీసులు జోక్యం చేసుకుని ఆ యాప్‌ల ద్వారా మాట్లాడి తిరిగి టికెట్ కొనుగోలు చేసిన వారికి తిరిగి పంపించడంతో సద్దుమణిగింది. ఈ ఘటన మంగళవారం రాత్రి 9.30గంటలకు చోటు చేసుకుంది. అయితే సెకండ్‌షో యదావిధిగా రన్ చేశారు.

బైకును ఢీకొన్న కారు... యువకుడు మృతి



పోరుమామిళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో బుధవారం మోటారు బైకును కారు ఢీకొనడంతో సురేశ్ (25) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పేరమ్మగారి పల్లెకు చెందిన సురేశ్ మోటారుబైకులో పోరుమామిళ్లకు వస్తుండగా కమ్మవారిపల్లె గ్రామ సమీపంలో బద్వేలు వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీ... వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో సోమవారం రాత్రి పని ముగించుకుని అమ్మచెరువు మిట్టకు వెళుతున్న రామస్వామి (64)ని ఆటో ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. శవపరీక్ష కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. వన్‌టౌన్ వన్‌టౌన్ సీఐ ఎరిషావలి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృ తునికి భార్య లక్ష్మీదేవి, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు...

బి.కొత్తకోట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... బి.కొత్తకోట పట్టణం బెంగళూరు రోడ్డులోని బీసీ కాలనీలో నివాసం వుండే జరిపిటి కేశవ కుమారుడైన జరిపిటి గణేష్(24) చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా వుండేవాడు. సోమవారం సొంతపనుల నిమిత్తం కర్నాటక సరిహద్దున వున్న ఓ గ్రామానికి వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి పొద్దుపోయాక బి.కొత్తకోటకు ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణంలో దానామిట్ట చెక్ పోస్టు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరు కొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరి యా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పేర్కొన్నారు.

ఆటో-స్కూటర్ ఢీ... ఒకరు

రాయచోటి టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం జగనన్న కాలనీకి సమీపంలో బుధవారం సాయంత్రం ఆటో, స్కూటర్ ఢీకొన్న ప్రమాదంలో సిద్దిఖ్(23) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం శిబ్యాల గ్రామం కస్పాకు చెందిన అల్లాబకష్ కుమారుడు సిద్దిఖ్, శిబ్యాల నుంచి రాయచోటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జగనన్న కాలనీ సమీపంలోకి రాగానే రాయచోటి వైపు నుంచి ప్రయాణీకులతో వెళుతున్న ఆటో ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దిఖ్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఎమ్మెల్యే ఎదుటే టీడీపీ వర్గీయుల వాగ్వాదం



బ్యానర్‌లోని శ్రీనివాసులు ఫోటోను కాల్చిన దృశ్యం

చాపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఎదుటనే టీడీపీ వర్గీయులు ఒకరిపై మరొకరు తోసుకుని వాగ్వాదానికి దిగారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే వెదురూరు గ్రామానికి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఎమ్మెల్యే రాజుపాళెం గ్రామం వద్ద కొద్దిసేపు వాహనం నిలబెట్టారు. ఎమ్మెల్యేతో మాట్లాడటానికి వారు పోటీ పడ్డారు. ఈ నేపధ్యంలో రాజుపాళెం గ్రామానికి చెందిన పల్లెం శ్రీనివాసులు, గోర్ల సుబ్బరాయుడు, నరహరిపురం గ్రామానికి చెందిన నందిమండలం పవన్‌కుమార్‌రెడ్డిల మధ్య కొద్దిసేపు తోపులాట, వాగ్వాదం జరిగింది. పక్కనే ఉన్న ఇతర టీడీపీ నాయకులు ఘర్షణ జరుగకుండా సర్దుబాటు చేశారు. మళ్లీ సాయంత్రం నరహరిపురం గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ వర్గీయులు రాజుపాళెం గ్రామానికి వచ్చారు. మళ్లీ ఘర్షణ జరుగుతుందేమోనని విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్న పెద్దయ్య పోలీసు సిబ్బందితో వచ్చి వారిని చెదరగొట్టారు. అప్పటికే పల్లెం శ్రీనివాసులుకు చెందిన ఫొటోను బ్యానర్‌లో కాల్చివేశారు. ఎమ్మెల్యే ఫొటో గోర్ల సుబ్బరాయుడు, పసల రమణ, నరసింగు ఓబులేసు, ఇంకా కొంత మంది ఫొటోలను కలిగి ఉన్న బ్యానర్‌ను పూర్తిగా చించివేశారు. దీంతో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనలో గ్రామస్థులు ఉన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ అడుగగా ఈ సంఘటన జరిగిన విషయం నిజమేనన్నారు. వారు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితాన్ని భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవికుమార్ సమాచారం మేరకు.. టి.సదుం పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు వెంకట్రమణ (50) భార్య ప్రమీల అనారోగ్యంతో 8 నెలల క్రితం ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందింది. ఆ తరువాత కుమార్తెకు వివాహం చేసి కుమారుడిని పోషించుకుంటూ ఒంటరిగా జీవిస్తూ ఉండేవాడు. సంక్రాంతి రోజు భార్య లేదని మనస్థాపం చెందాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది కాలనీ సమీపంలో ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

తిరుమలలో విషాదం

● భవనంపై నుంచి కిందపడి బాలుడి మృతి



తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. ఆడుకుంటూ భవనంపై నుంచి కిందపడి మూడేళ్ల బాలుడు మృతిచెందాడు. పోలీసులు, విజిలెన్స్ వివరాల మేరకు.. కడప జిల్లా చిన్నచౌక్‌కు చెందిన శ్రీనివాసులు, కృష్ణవేణి దంపతులు తమ ఇద్దరు కుమారులు నిహాంత్, సాత్విక్ శ్రీనివాసరాజు(3)తో కలిసి శ్రీవారి దర్శనార్థం 13న తిరుపతికి చేరుకున్నారు. 14వ తేదీ తిరుపతిలో 16వ తేదీకి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు పొంది బుధవారం ఉద యం తిరుమలకు చేరుకున్నారు. ఈక్రమంలో తిరుమల ఆర్టీసీ బస్టాండ్ లోని పద్మానాభ నిలయంలోని లాకర్‌ను పొందారు. తలనీలాల సమర్పణ అనంతరం వరాహస్వామిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి లాకర్ వద్దకు చేరుకున్నారు. సాయంత్రం అన్న నిహాంత్‌తో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సాత్విక్ రెండవ అంతస్తులోని మెట్ల రైలింగ్ మధ్య ఖాళీ నుంచి కిందపడిపోయాడు. గుర్తించిన శ్రీనివాసుల దంపతులు వెంటనే తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. కాసేపటికే బాలుడు మృతి చెందాడు. బిడ్డ మరణంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. 2టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల దరఖాస్తుల గడువు పొడిగింపు

కలికిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి కలికిరి సైనిక్ స్కూల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు పంపుకోవడానికి పది రోజుల గడువు పొడిగిస్తూ నేషనల్ టెస్టిం గ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నోటిఫికేషన్ జారీ చేసింది. సైనిక్ స్కూల్లో ఆరు, తొమ్మిదవ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న అర్హత పరీక్షలు రాయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు పంపుకోవడానికి ఈ నెల 13 గడువుగా ప్రకటించారు. తాజాగా ఈ గడువును ఈ నెల 23 తేదీకి పొడిగిస్తూ ప్రకటన జారీ చేసింది. దీనికి అనువుగానే గతంలో ఫీజు చెల్లించడానికి 14వ తేదీగా వున్న గడువును 24వ తేదీ రాత్రి 11.50 గంటలకు పొడిగించారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తుల్లో ఏవేనా లోపాలుంటే వాటిని సరిదిద్దుకోవడానికి కూడా గతంలో 16వ తేదీ నుంచి 18వ తేదీలోగా అవకాశమిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ కోసం కూడా 26 నుంచి 28వ తేదీలోగా సవరించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. కాగా విద్యార్థుల ఆధార్ కార్డు ఆధారంగా దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాల్లో అభ్యర్థి పేరు, ఫొటో, సంతకం, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ, చిరునామాలు, పరీక్షా కేంద్రాలను మార్చుకోవడానికి మాత్రం అవకాశం లేదు. అయితే జండ ర్, పుట్టిన తేదీ, కేటగిరీ, మీడియమ్, తల్లిదండ్రుల పేర్లు మార్చుకోవడానికి అవకాశమిచ్చారు. ఇక ఆధార్ వివరాలతో లేని దరఖాస్తుల్లో కూడా పైవిధంగానే మార్పులు చేసుకోవడానికి అవకాశముంది.

అందుబాటులోని సీట్లు

కలికిరి సైనిక్ స్కూల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం అందుబాటులో వున్న సీట్ల వివరాలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ స్కూల్లో మొత్తం ఆరవ తరగతిలో ప్రవేశాలకు 106, తొమ్మిదవ తరగతిలో ప్రవేశాలకు 16 సీట్లు అందుబాటులో వున్నాయి. ఇందులో ఆరవ తరగతిలో బాలికలకు 10 సీట్లు కేటాయించారు. తొమ్మిదవ తరగతిలో బాలికలకు ఒక సీటు మాత్రం అందుబాటులో వుంది. ఇవి కాకుండా ఎస్పీఎస్ నెల్లూరులోని ఆదాని వరల్డ్ స్కూల్లో (డే స్కూల్) ఆరవ తరగతిలో 80 సీట్లు, తొమ్మిదవ తరగతిలో 66 సీట్లు కూడా అందుబాటులో వున్నాయి.

పరీక్షా కేంద్రాలు

కలికిరి, కోరుకొండ సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్షల కోసం అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, శ్రీకాకు ళం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

పీపీ1, పీపీ2 తరగతులు ప్రారంభించాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ మీడియం, ఉర్దూ సెక్షన్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పీపీ1, పీపీ2 తరగతులు ప్రారంభించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని నగరపాలక ఉర్దూ పాఠశాల (సాలె నాగయ్య)లో రూట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనర్ మీడియా ఉర్దూ ఫౌండేషన్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:15గా ఉంచాలని, 45 మంది విద్యార్థులు ఉన్నత ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, అసోసియేట్ అధ్యక్షుడు సత్తార్ ఫైజీ, షాహిదుల్లా మాట్లాడారు. రాష్ట్ర డైరీ కమిటటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీం సాహెబ్, ఉపాధ్యక్షుడు అఫ్జల్ బాష మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను రెగ్యులర్ చేసి ఉర్దూ ఆచార్య పోస్టులు మంజూరు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ మస్తాన్ వలి, బేపారీ ఫక్రుద్దీన్ ప్రసంగించారు. ప్రముఖ కవి మఖ్బూల్ అహ్మద్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోటను సందర్శించిన కలెక్టర్



సిద్దవటం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పురావస్తుశాఖ పరిధిలో ఉన్న సిద్దవటం కోటను మంగళవారం కలెక్టర్ శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. కోటలోని 1, 2 మండపాలు, కోట ముఖద్వారం, పార్కు, కామాక్షి ఆలయం, రాణి స్నానపు వాటిక, రాజు మహల్, రాణిమహల్, బిస్మిల్లా షావలి దర్గా, శివ లింగం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలోని శిల్పా లు అద్భుతంగా ఉన్నాయన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మాధవరంలో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

సిద్దవటం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తన ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహరించుకు వెళ్లారని మాధవరంలోని పార్వ తీపురం ప్రాంతానికి చెందిన పెంచలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు తన అత్త నరసమ్మ కడపలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో ఆమెను చూసేందుకు శనివారం రాత్రి వెళ్లామని, సోమవారం ఉదయం తమ ఇంటి ఎదురుగా ఉన్న మల్లమ్మ ఫోన్ చేసి.. తమ ఇంటి తలుపులు తెరిచి ఉన్న విషయం తెలపడంతో 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం పోలీసులు విచారణ చేపట్టగా.. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బచంద్ర తెలిపారు.

ఆణిముత్యాలు

● అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో మెరిసిన యువక్రీడాకారిణులు ● బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు





జంప్‌రోప్ చాంపియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన భువనశ్రీ, ఆషియా

దువ్వూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో యువ క్రీడాకారిణులు తమ సత్తా చాటి పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. ఆ యువ క్రీడాకారిణుల గురించి తెలుసుకోవాలంటే...

దువ్వూరు మండలంలోని రాంసాయినగర్ అనే మారు మూల గ్రామంలో భువనశ్రీ జన్మించింది. తల్లిదండ్రులు సాధారణ వ్యక్తులు. తండ్రి జీపు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. పేద కుటుంబంలో జన్మించిన భువనశ్రీ నంద్యాల జిల్లాలోని ఏపీఎం మోడల్‌స్కూలులో 8వ తరగతి చదువుతోంది. ఈ అమ్మాయి క్రీడలపట్ల ఆసక్తి కనపరచడంతో అక్కడి స్పోర్ట్స్ కోచ్‌లు షేక్ గౌస్, పక్కీరయ్య, వెంకటసుబ్బయ్య గమనించి.. జంప్‌రోప్ శిక్షణ అందించారు.

ఈ నేపధ్యంలో ఈనెల 6 నుంచి 8 వరకు నేపాల్‌లోని ఫోక్రా నగరం రంగశాల స్టేడియంలో ఇంటర్నేషనల్ స్థాయిలో లాంగ్‌రోప్ పోటీలు జరిగాయి. 30 సెకన్ల సైక్లింగ్ పోటీతో పాటు లాంగ్‌రోప్ (ఎల్ఆర్ఎస్) పోటీలో పాల్గొని రెండింటిలో గోల్డ్‌మెడల్స్ సాధించి.. ప్రశంసలు అందుకుంది. ఈ పోటీల్లో ఇండియా, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ దేశాల నుంచి 22 విభాగాల్లో 1400 మంది ఆయా దేశాల్లోని ప్రతిభావంతులు పోటీ పడ్డారు. అందులో భువనశ్రీ రెండు బంగారు పతకాలు సాధించడం విశేషం.

జపాన్‌లో పోటీలకు ఆహ్వానం

జపాన్‌లోని కవాసకిలో జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలని భువనశ్రీకి ఆహ్వానం అందింది. అయితే ఈ అమ్మాయి తన కుటుంబానికి పేదరికం అడ్డు తగులుతోందని ఆవేదన వెలిబుచ్చుతోంది. తన తండ్రి సాయిప్రసాద్ సాధారణ బస్సు డ్రైవర్ అని, కష్టపడి తనను ఇంతవరకు ప్రోత్సహించారని తెలిపింది. జపాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొనాలంటే కనీసం రూ.3లక్షలు అయినా ఖర్చు అవుతుందని తన తండ్రికి అంత స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దాతలు ప్రోత్సహిస్తే జపాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటానని భువనశ్రీ ఆశాభావం వ్యక్తం చేసింది.

ఆషియాకు... పసిడి పతకాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్లామిక్ హైస్కూలుకు చెందిన 6వ తరగతి విద్యార్థి పి.ఆషియా అంతర్జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీల్లో తన ప్రతిభ చాటి పడిసి పతకాలు సాధించింది. ఈనెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు నేపాల్‌లోని పోక్రాన్‌లో జరిగిన 30 సెకన్ల సైక్లింగ్ పోటీతో పాటు లాంగ్‌రోప్ (ఎల్ఆర్ఎస్) పోటీలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఆ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాహిద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు హసీనా, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా, ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో బంగారు పతకం సాధించింది.

కోదండరాముడి సన్నిధిలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఒంటిమిట్ట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండ రామున్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్ మంగళవారం దర్శించుకున్నారు. వీరికి టీటీడీ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సంక్రాంతి సందర్భంగా పురాతన ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలు సుఖశాంతులతో బంధువులతో జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

సుండుపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డ రాచపల్లికి సమీపంలో నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి సోమలరాజుగారి పల్లెకు చెందిన కొండూరు జనార్దన్ రాజు రూ.50,116 వేలు నగదు అందజేసినట్లు గ్రామస్తులు గంగరాజు, శివ ప్రసాద్ రాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా దాతను శాలువాతో సన్మానించారు.

సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ ఇవ్వాలి

చిట్వేలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : బొప్పాయి తోటల్లో కోతుల దాడుల నివారణకు 90 శాతం సబ్సిడీపై సోలార్ ఫెన్సింగ్ ఇవ్వాలని రైతు నాయకులు మలిశెట్టి జతిన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం వెంకటరాజుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బొప్పాయి సాగు చేయాలంటే కచ్చితంగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిందేనన్నారు. అడవి పందులు, కోతుల బెడదతో రైతులు బొప్పాయి సాగును వదిలేశారన్నారు. వీటివల్ల ఇప్పటికే నష్టపోయిన బొప్పాయి రైతులందరికీ నష్ట పరిహారం చెల్లించాలని జతిన్ విజ్ఞప్తి చేశారు.

రాజధాని అభివృద్ధికి రూ.50 వేలు విరాళం



సీఎంను కలిసిన రెడ్డయ్య రాజు

సుండుపల్లి,జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడును కుప్పం నియోజకవర్గం నారావారిపల్లిలో బుధవారం కలిసినట్లు సుండుపల్లిలో ఒక ప్రకటనలో వశిష్ట పాఠశాల వ్యవస్థాపకుడు, సంఘసేవకుడు డాక్టర్ రెడ్డయ్య రాజు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.50 వేలు చెక్కును అందజేసి ముఖ్యమంత్రిని వాలువాతో సన్మానించినట్లు తెలిపారు.

టీటీడీ ఆధ్వర్యంలో గో పూజ

పుల్లంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బావికాడపల్లి వరదయ్య గారిపల్లిలోని లక్ష్మీవాత్సల్య గోశాలలో తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో బుధవారం గోపూజ నిర్వహించారు. ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు ఆధ్వర్యంలో గోశాల నిర్వాహకులు భక్తవత్సలంనాయుడు, తదితరుల గోవులకు పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులకు గోశాల నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. గోశాలలోని శ్రీకృష్ణ పరమాత్మనికి ముందుగా పూజలు జరిపి అనంతరం విచ్చేసిన భక్తులందరూ అన్ని గోవులకు పసుపు కుంకుమలతో వస్త్రాలతో అలంకరించి నవ ధాన్యాలతో కూడిన ఆహారం, తౌడు అందించారు. ఆధ్యాత్మిక ఉపన్యాసకులు అరవ రమణయ్య గోపూజ ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక ప్రవచకులు కొత్త నరసింహులు, ధర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ, శ్రీవారి భక్త సేవాసమితి అధ్యక్షులు రఘునాథ్, వరలక్ష్మీ, నరసారెడ్డి, పార్వత మ్మ, చప్పిడి చిన్నబ్బి, నాగేశ్వరమ్మ, సుబ్రమణ్యం, శంకరమ్మ దంపతులు పాల్గొన్నారు.

సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి


సంబేపల్లె, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగ అని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని బావులకాడపల్లెలోని యువత నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బుధవారం ఆయన బహుమతులు అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించేందుకు బావులకాడ పల్లెలోని యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గ్రామ మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన మద్దిపట్ల కమల కు వాషింగ్ మెషీన్, ద్వితీయ బహుమతి కింద వాటర్ ఫిల్టర్, తృతీయ బహుమతిగా మిక్సీ నాలుగో బహుమతిగా సీలింగ్ ఫ్యాన్, ఐదవ బహుమతిగా ఐరన్ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాళ్లపల్లె వేణుగోపాల్ నాయుడు, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ నాయుడు, లక్ష్మయ్య నాయుడు, పొత్తూరు అశోక్, కిశోర్ చౌదరి, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

రామాపురం: మండలంలోని అడపమాలపల్లెలో మినీ గోకులాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతుల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. రాయచోటి నియోజకవర్గానికి 300 గోకులాలు మంజూరయ్యాయని, పశుసంవర్ధక శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులు సమన్వయంతో షెడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డితో సమావేశమయ్యారు. గోపగుడి పల్లెలో గుండు గంగమ్మకు పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రమేష్ రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

గాలివీడు: మండలంలోని అరవీడు గ్రామంలో బుధవారం ఎల్లంపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన్న మాట్లాడుతూ పండగ సందర్భంగా స్వగ్రామాలకు చేరుకున్న యువత కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపడంతోపాటు, వివిధ రకాల ఆటల పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించి గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు మందపాటి రవీంద్రబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అరవీడులో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చీరల పంపిణీ

రాయచోటిటౌన్: మకర సంక్రాంతి సందర్భంగా పట్టణంలోని రాజుల కాలనీలో గండికోట చిన్న పుల్లయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

కనుమతో ముగిసిన సంక్రాంతి సంబరాలు

గాలివీడు జనవరి 15(ఆంధ్రజ్యోతి) సంక్రాంతి సంబరాలు బుధవారం కనుమ పండగతో ముగిశాయి. వివిధ పట్టణాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, యువత, ఉద్యోగులు గ్రామాలకు చేరుకున్నారు. మొదటి రోజు భోగి మంటలు వేసుకొని, గాలిపటాలు ఎగురవేశారు. క్రికెట్, వాలీబాల్ వంటి ఆటలను ఆడారు. మకర సంక్రాంతి రోజున ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం పూర్వీకుల సమాధులకు పూజలు చేశారు. కనుమ రోజున పశువులకు సుందరంగా అలకరించి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా చిట్లకుప్ప వద్దకు తీసుకెళ్లారు. కాటంరాజుకు పూజల అనంతరం పశువులను బెదిరించారు. మండలంలోని నాగూరివాండ్లపల్లి, కమలామారి, బురుజుపల్లి, అరవీడు గ్రామాల సమీపంలో చిట్లకుప్పలకు నిప్పుపెట్టి పశువులను బెదిరించారు.

సంబేపల్లె: కనుమ పండుగ సందర్భంగా బుధవారం మండలంలోని రైతులు పశువులకు కొమ్ములకు రంగులు వేసి అందంగా ముస్తాబు చేసి కాటమరాయుడు ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం మంటల మధ్య పశువులను బెదిరించారు. సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలంటూ పూజలు చేశారు. మహిళలు గారెలు వండి కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపారు.

రాయచోటి: స్థానిక కూటాలమ్మ గుడి వద్ద రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూజలు నిర్వహించారు. ఎగువ అబ్బవరంలో అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ , చెన్నముక్కపల్లె పంచాయతీలో సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో చిట్లకుప్ప ఏర్పాటు చేసి కాటమరాజుకు పూజలు నిర్వహించారు. చాందినీ బండ్లను ఏర్పాటు చేశారు.

చిన్నమండ్యం: కనుమ పండుగ సందర్భంగా పెద్దమండ్యం, పాపేపల్లి, కలిచెర్ల, ముసలికుంట, బండ్రేవు, మందలవారిపల్లి, శివపురం, సి.గొల్లపల్లి, బండమీదపల్లి, వెలిగల్లు గ్రామాల్లోని రైతులు పశువులను ఊరేగించారు. కాటంరాజు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పశువులకు బెలూన్‌లు, కొమ్ములకు రంగు కాగి తాలు, నోట్లు కట్టి ఊరేగించారు. కాటంరాజుకు పూజలు చేసిన తరవాత చిట్లాకుప్ప మంటల చుట్టూ పశువులను ప్రదర్శనలు చేశారు.

నందలూరు : మండలంలోని చెయ్యేరు (బాహుదానది)లో బుధవారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. కుమ్మరపల్లి ఇసుకపల్లి ప్రజలు, గుండు మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



సంబేపల్లె: చిట్లకుప్ప వద్ద పశువులను బెదిరిస్తున్న రైతులు

ఇసుకలో ఎడ్లబండ్ల పోటీల్లో మొదటి బహుమతి నాయనపల్లి జనార్దన్ దివాన్‌కాట్, ద్వితీయ బహుమతి చింతకుంట సుధాకర్‌రెడ్డి వాషింగ్‌మెషీన్, తృతీయ బహుమతి దేవిశెట్టి బాలయ్య మిక్సీని గెలుచుకున్నారు. డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీల్లో మొదటి బహుమతి బిందు, రెండో బహుమతి దాక్షాయణి, మూడో బహుమతి సృజన, నాలుగో బహుమతి జస్వంత్, ఐదో బహుమతి రమ్యశ్రీ గెలుచుకున్నారు. మండలంలోని నందలూరు గ్రామంలో నడివీధి గంగమ్మ ఆలయం వద్ద ఎద్దులకు పూజలు నిర్వహించారు. ఎద్దులను రంగులు పూలతో సుందరంగా అలంకరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

సుండుపల్లి: కనుమ సందర్భంగా బుధవారం పశువులను అలంకరించి చిట్లా కుప్పల చుట్టూ తిప్పారు. చెన్నంశెట్టి పల్లె సమీపంలో కాటమరాయుడికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఏసీ మెంబర్, జనసేన చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ హాజరయ్యారు. టీడీపీ నాయకులు చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, తోట రవీంద్ర గ్రామ కమిటీ సభ్యులు,జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : గొబ్బెమ్మ అమ్మవారిని జల్లెడలో ప్రత్యేకంగా అలంకరించి మహిళలు గొబ్బెమ్మ పాటలు పాడుతూ కోలాటాలు నిర్వహిస్తూ నిమజ్జనం చేశారు.

లక్కిరెడ్డిపల్లి: కనుమ సందర్భంగా పశువులను అలంకరించి చిట్లా కుప్పల వద్దకు తీసుకెళ్లి మంటలు చూపించారు.

'అన్నమాచార్య' ఆధ్వర్యంలో చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి, ఎల్లారెడ్డి

రాజంపేట టౌన్, జనవరి 15 (ఆంధ్ర జ్యోతి) : అన్నమాచార్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో మదనగోపాలపురం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా మదనగోపాలపురం గ్రామ మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామన్నారు.

రాయచోటి టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం అర్చన విద్యాసంస్థల కరస్పాండెంట్ డా.పి.మదన్‌మోహన్ రెడ్డి, కంచాలమ్మ గండి చెరువు నీటి సంఘం ఛైర్మన్ రఘునాథరెడ్డి కుటుంబసభ్యులు ఎగువ అబ్బవరం, పెదకాల్వ పల్లె, మాలపల్లె, మాదిగపల్లెల్లోని 200 మంది నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మదన్ మోహన్ రెడ్డి సతీమణి లక్ష్మి, భరత్ రెడ్డి, రాజారెడ్డి, సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చౌక దుకాణం కేటాయింపులో అన్యాయం

● జడ్పీటీసీ మాజీ సభ్యుడి ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయుడోరి రమణ తదితరులు

ఓబులవారిపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి గెలిచి రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినా నియోజకవర్గంలో వైసీపీ నాయ కులు రాజ్యమేలుతున్నారని ఓబులవారిపల్లె జడ్పీటీసీ మాజీ సభ్యుడు నాయుడోరి రమణ ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని గాదెలలో గ్రామదేవత దేవాలయం వద్ద టీడీపీ కార్యకర్తలతో కలిసి నోటికి మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గాదెల వెంకటాపురం గ్రామంలోని రేషన్ దుకా ణానికి గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి ఏజెంటుగా ఉన్న వంగసాని ఆదినారాయణ కుమార్తె యశస్వినికి కాకుండా, వైసీపీ ఏజెంట్‌గా ఉన్న ఒంగినేని చిన్నరెడ్డయ్య కు కేటాయించాలని టీడీపీ ఇన్‌చార్జి కుటుంబ సభ్యులు సూచించారన్నారు . ఇప్పటికైనా రైల్వేకోడూరు నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించకపోతే టీడీపీ కార్యకర్తలు కనుమరుగవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

మాంసానికి పెరిగిన డిమాండ్

రైల్వేకోడూరు/ఒంటిమిట్ట జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ సందర్భంగా బుధవారం తెల్లవారు జాము నుంచి మాంసపు దుకాణాల వద్ద ప్రజలు బారులుతీరారు. దీంతో వ్యాపా రులు కిలో మాంసం ధర రూ. 850కి, ఒంటిమిట్ట మండలంలో కిలో 800కు విక్ర యించారు. పుల్లంపేట మండలంలో కిలో మాంసం రూ. 700లు అనే సరికి మాంసం ప్రియులు తండోపతండాలుగా అక్కడికి తరలి వెళ్లారు. ఇది ఇలా ఉండగా కిలో చికెన్ కిలో రూ. 200లు పలికింది.

పెనగలూరులో చౌకగానే..

పెనగలూరు: పెనగలూరులో చికెన్ ధర ప్రజలకు అందుబాటులోనే ఉంది. బస్టాండ్ ఏరియాలో ఉన్న 20 చికెన్ సెంటర్లలో కిలో 160 రూపాయలకే విక్రయించారు. నెల రోజులుగా పెనగలూరు బస్టాండ్ ఏరియాలో కిలో చికెన్ 160 రూపాయలకు మించకపోవడం విశేషం. పెనగలూరులో ఒక్కో వ్యాపారి 200 నుంచి 400 కిలోల వరకు చికెన్ అమ్మినట్లు సమాచారం.

వైభవంగా కోదండరాముడి పార్వేట ఉత్సవం



పారువేటకుబయలుదేరిన కోదండరామస్వామి

ఒంటిమిట్ట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమ పండుగ పురస్కరించుకుని బుధవారం సాయంత్రం స్థానిక నాగేటి తిప్పపై కోదండరామస్వామి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై మండపం వద్దకు తీసుకువచ్చిన అనంతరం అర్చకులు శాస్త్రీయంగా స్వామివారి పారువేట ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవం అనంతరం పురవీధుల గుండా స్వామివారు కోదండ రామాలయానికి చేరుకున్నారు. అర్చకుడు వీణా రాఘవాచార్యులు పవన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ నవీన్, ఏఈ అమర్‌నాథ్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దారి దోపిడీ యత్నం విఫలం

ఓబులవారిపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళుతున్న జంటపై దోపిడీకి కొందరు యత్నించారు. బాధితుల కథనం మేరకు పుల్లంపేట మండలం మల్లెంవారిపల్లె నుంచి కొలవల శ్రీనివాసులురెడ్డి తన భార్య వెంకటసుబ్బమ్మతో కలసి బుధవారం సాయంత్రం మంగంపేట కాపుపల్లికి బైకుపై వస్తుండగా, ఇద్దరు దుండగులు మరో బైకుపై వారిని అనుసరించారు. దుండగుల్లో ఒకరు మహిళ మెడలోని బంగారు గొలుసు లాగే ప్రయత్నం చేయగా అది తెగి ఆమె దుస్తుల్లోనే పడిపోయింది.. దీంతో వారు ఆమెను కిందకు తోసి వేయడంతో ఆమె కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. హైవే రోడ్డుపై గోతుల కారణంగా వాహనదారులు నిధానంగా వెళ్లడమే దొంగలకు అనుకూలంగా మారిందని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కోసం కృషి చేసిన వారిని గుర్తించాలి



నారావారిపల్లెలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడుతున్న పంతగాని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలసిన కేకే చౌదరి

రైల్వేకోడూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం అహర్నిశలు కృషి చేసిన వారికి ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుకు విన్నవించినట్లు రాష్ట్ర టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నారావారిపల్లెలో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు బుధవారం మీడియాకు వివరించారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పరిస్థితులను ముఖ్యమంత్రికి విన్నవించామని వివరించారు. టీడీపీ కోసం అహర్నిశలు కృషి చేసిన వారికి ప్రాధాన్యం కల్పించాలని విన్నవించగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రాష్ట్ర ఛైర్మన్ కేకే చౌదరి మర్యాద పూర్వకంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు.

ఘనంగా మకర సంక్రాంతి



రైల్వేకోడూరు పురవీధుల్లో ఊరేగుతున్న కొత్తబజారు కోదండరాముడు

రైల్వేకోడూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మకర సంక్రాంతిని ఘనంగా చేసుకున్నారు. ఉదయాన్నే బలిజవీధి, కొత్త బజారు, ఆర్యవైశ్య సమాజం వారు కోదండరామాలయం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. చిన్నలు, పెద్దలు కొత్త బట్టలు ధరించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం వైఎస్ సర్కిల్ వద్ద కనుమ భోగి వేశారు. పశువులను ఊరేగించారు. గ్రామాల్లో పందేరం బండ్లు కట్టి పశువులను ఊరేగించారు.

సీతారాముల గ్రామోత్సవం



సిద్దవటంలో సీతారాములను పల్లకిపై ఊరేగిస్తున్న గ్రామస్తులు

సిద్దవటం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : మకర సంక్రాంతి సందర్భంగా మండలంలోని వెంకటాయపల్లె సిద్దవటం, వడ్డీవారిపల్లె, మాచుపల్లె, బాకరాపేట, జ్యోతి, కడపాయపల్లె, సంటిగారిపల్లె గ్రామాల్లో సీతారాముల గ్రామోత్సవాలు,, ముగ్గుల పోటీలు, ఆటలపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు.

నిరుపేదలకు ఆర్థిక సాయం



నిరుపేదలకు మాంసం పంపిణీ చేస్తున్న జనసేన పార్టీ కార్యకర్తలు

సిద్దవటం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా నిరుపేద ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయ కులు మాంసం, కోళ్లతోపాటు ఆర్థిక సాయం అందించారు. మంగళ, బుధ వారాల్లో మండలంలోని ఎస్.రాజంపేట, జంగాలపల్లె గ్రామాల్లోని 450 ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు కోళ్లు, 150 కుటుంబాలకు కోడి మాంసం, 600 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.300 చొప్పున నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దిగ్గ తిరుపతయ్య మాట్లాడుతూ జనసేన నాయకుడు కృష్ణ దాతృత్వాన్ని అభినందించారఈ కార్యక్రమంలో జనసేనపార్టీ కార్యకర్తలు విజయ్, పసుపులేటి గంగయ్య, రత్నం, ముస్లిం మైనార్టీ నేతలు గౌస్‌పీర్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత గన్నే సుబ్బనరసయ్య నాయుడు

రాజంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం మండలంలోని మేకవారిపల్లెలోని పేదలకు బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో గన్నే లక్ష్మీనారాయణ, గన్నే సుదర్శన్, అంజయ్య కుటుంబ సభ్యులతో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గన్నే సుబ్బనరసయ్యనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో పేదలందరూ సంతోషంగా ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



అన్నమాచార్య నైట్స్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న చొప్పా అభిషేక్‌రెడ్డి

రాజంపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీలో వారం రోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అన్నమాచార్య నైట్స్ జట్టు ఫైనల్‌కు చేరుకుని ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు యూనివర్సిటీ ప్రో చాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి కప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థుల కోసం ఈ టోర్నమెంట్ నిర్వ హించారన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నాగముని, డాక్టర్ కిషోర్‌కుమార్, కె.దినేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. కోనంపేట శివాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీ విజేతలకు బుధవారం ఆయన బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మదన్మోహన్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు తెరుచుకోని వెబ్‌సైట్

● వరుస సెలవులతో మంజూరు కాని ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు
● అయోమయంలో ఆశావహులు ● నేటితో ముగియనున్న గడువు... పెంచాలంటూ విజ్ఞప్తి


పీలేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు' అన్నట్లుగా మారింది జిల్లాలోని స్వయం ఉపాధి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ కార్పొరేషన్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఈనెల 7వ తేదీ జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో సబ్సిడీ రుణాల కోసం నోటిఫికేషన్ వెలువడింది. అయితే అప్పటి నుంచి సంబంధిత పోర్టల్ తెరుచుకోకపోవడంతో పాటు రుణాల దరఖాస్తు కోసం కావాల్సిన ధృవీకరణ పత్రాలు సైతం సకాలంలో అందక చాలామంది నిరుద్యోగులు అయోమయంలో ఉన్నారు. ఒకవైపు రుణాల దరఖాస్తు కోసం ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగిసిపోతున్నా, సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి సానుకూల సమాధానం లేకపోవడంతో వారందరూ నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారు. పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆ పోర్టల్ తెరుచుకోవడం లేదని, దరఖాస్తు ఆఖరు గడువును పెంచాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం భారీ నోటిఫికేషన్

జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రంగంలో ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7వ తేదీ అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో 1964 యూనిట్ల స్థాపన కోసం నోటిఫికేషన్ వెలువరించింది. అందులో జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 1350 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 67 యూనిట్లు, కమ్మ కార్పొరేషన్ ద్వారా 10 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 69 యూనిట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 14 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 13 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, కాపు కార్పొరేషన్ ద్వారా 379 యూనిట్లు, కాపు ఎంఎస్ఎంఈ గ్రూపు రుణాలు 3 యూనిట్లు మంజూరు చేశారు. వీటిలో యూనిట్ ఖరీదు రూ.5 లక్షలు కాగా, 50 శాతం సబ్సిడీ ఉంటుంది. మిగిలిన 50 శాతం బ్యాంకు రుణంగా లభిస్తుంది. అవి కాకుండా జనరిక్ మందుల షాపుల కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా 30 యూనిట్లు, ఈబీసీ కార్పొరేషన్ ద్వారా 9 యూనిట్లు, కమ్మ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, రెడ్డి కార్పొరేషన్ ద్వారా 11 యూనిట్లు, ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, క్షత్రియ కార్పొరేషన్ ద్వారా 2 యూనిట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 1 యూనిట్ మంజూరు చేశారు. జనరిక్ మెడిసిన్ దుకాణం యూనిట్ ఖరీదు రూ.8 లక్షలు కాగా సబ్సిడీ రూ.4 లక్షలు, బ్యాంకు రుణం రూ.4 లక్షలు లభిస్తుంది.

నేటితో ముగియనున్న గడువు

రుణాల కోసం అర్హులైన వారు ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ లోపు తమ ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరీ సిస్టం (ఏపీవోబీఎంఎంఎస్) అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహణ సంచాలకులు శిరీషా తన ప్రకటనలో తెలిపారు. అయితే ఆరోజు నుంచి బుధవారం రాత్రి వరకు కూడా ఆ వెబ్‌సైట్ పూర్తిగా తెరుచుకోలేదని ఆశావహులు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు ప్రయత్నించినా 'కమింగ్ సూన్' అని మాత్రమే కనిపిస్తోందని, అంతకు మించి ఎటువంటి సమాధానం రావడం లేదని వారు వాపోతున్నారు. దానికితోడు రెవెన్యూ సదస్సులు, వరుస సెలవుల కారణంగా రెవెన్యూ అధికారులు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాల మంజూరులోనూ విపరీతమైన జాప్యం చేశారని వారు తెలిపారు. వాటి కారణంగానూ తాము దరఖాస్తు చేసుకోలేకపోయామని వారు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. గడువును మరో 10 రోజులు పెంచాలని, ఏపీవోబీఎంఎంఎస్ వెబ్ సైట్‌ను పూర్తిగా అందుబాటులోకి తేవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే దరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండడంతో ఎంత మంది దరఖాస్తు చేశారో స్థానిక అధికారులకు తెలియడం లేదు. ఒకరిద్దరు ఆశావహులు మాత్రం తమకు ఫోన్ చేసి వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నట్లు తెలియజేశారని వారు చెబుతున్నారు.



'కమింగ్ సూన్' అంటూ చూపుతున్న ఏపీఓబీఎంఎంఎస్ పోర్టల్

బాలసాహిత్యం విజ్ఞానానికి సోపానం


చిట్టిచేతులు బాలల కథల పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బాలసాహిత్యం విజ్ఞానానికిసోపానం అని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. తెలుగు భాషోపాధ్యాయులు పల్లా వెంకటరామారావు రచించిన చిట్టిచేతులు పుస్తకావిష్కరణ బుధవారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ బాలల కథలు పిల్లలకు ప్రపంచజ్ఞానాన్ని, మంచి, చెడు విచక్షణను తెలియజేస్తాయన్నారు. బాలలకోసం రచయిత చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సభాధ్యక్షుడు అవధాని నరాల రామారెడ్డి మాట్లాడుతూ పిల్లలను నైతిక విలువల అభివృద్ధికి, సమాజం పట్ల అవగాహనకు, మంచి నడవడికకు బాలల కథలు తోడ్పడుతాయన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డీకే చదువులబాబు మాట్లాడుతూ పిల్లలతో బాల సాహిత్యం చదివించడం వలన వారిలో మంచి అలవాట్లను పెంపొందించవచ్చునని తెలిపారు. రచయిత పల్లా రామారావు మాట్లాడుతూ నేటితరం పిల్లలు బాలసాహిత్యాన్ని చదవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కవి ఏసీ దస్తగిరి, రచయితలు కొమ్మిశెట్టి మోహన్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, జింకా సుబ్రమణ్యం, కొత్తపల్లె శ్రీను, బండారు రఘురామయ్య, పల్లా శేషయ్య, బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన సినిమా ప్రదర్శన.. ప్రేక్షకుల ఆందోళన

కడప క్రైం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నాగరాజుపేటలోని గ్రూప్ థియేటర్లలో వెంకటేశ్, ఐశ్వర్యారాజేశ్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ప్రదర్శన ఓ హాలులో జరిగింది. అరగంట తరువాత టెక్నికల్ ఇష్యూతో సినిమా ప్రదర్శన ఆగిపోయింది. దీంతో ప్రేక్షకులు హాలు ఎదుట ఆందోళనకు దిగారు. డబ్బు చెల్లించాలంటూ థియేటరు యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రేక్షకులకు సర్దిచెప్పే యత్నం చేశారు. తాము చెల్లించిన డబ్బు వెనక్కి ఇవ్వాలని డిమండ్ చేశారు. దీంతో హాలు యాజమాన్యం టికెట్ కొనుగోలు చేసిన వారికి డబ్బు చెల్లించారు. ఆన్‌లైన్‌లో టికెట్ కొనుగోలు చేసిన వారికి మొదట ఇవ్వకపోవడంతో తరువాత పోలీసులు జోక్యం చేసుకుని ఆ యాప్‌ల ద్వారా మాట్లాడి తిరిగి టికెట్ కొనుగోలు చేసిన వారికి తిరిగి పంపించడంతో సద్దుమణిగింది. ఈ ఘటన మంగళవారం రాత్రి 9.30గంటలకు చోటు చేసుకుంది. అయితే సెకండ్‌షో యదావిధిగా రన్ చేశారు.

పీపీ1, పీపీ2 తరగతులు ప్రారంభించాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ మీడియం, ఉర్దూ సెక్షన్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పీపీ1, పీపీ2 తరగతులు ప్రారంభించాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని నగరపాలక ఉర్దూ పాఠశాల (సాలె నాగయ్య)లో రూట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి జుబేర్ అహ్మద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మైనర్ మీడియా ఉర్దూ ఫౌండేషన్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:15గా ఉంచాలని, 45 మంది విద్యార్థులు ఉన్నత ప్రాథమిక పాఠశాలను మోడల్ ప్రాథమిక పాఠశాలగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రూట వ్యవస్థాపక అధ్యక్షులు సయ్యద్ హిదాయతుల్లా, అసోసియేట్ అధ్యక్షుడు సత్తార్ ఫైజీ, షాహిదుల్లా మాట్లాడారు. రాష్ట్ర డైరీ కమిటటీ ఛైర్మన్ హాజీ అబ్దుల్ హకీం సాహెబ్, ఉపాధ్యక్షుడు అఫ్జల్ బాష మాట్లాడుతూ యోగి వేమన విశ్వవిద్యాలయంలోని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను రెగ్యులర్ చేసి ఉర్దూ ఆచార్య పోస్టులు మంజూరు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కన్వీనర్ మస్తాన్ వలి, బేపారీ ఫకృద్దీన్ ప్రసంగించారు. ప్రముఖ కవి మఖ్బూల్ అహ్మద్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోటను సందర్శించిన కలెక్టర్



సిద్దవటం, జనవరి 15 (ఆంధ్ర జ్యోతి): పురావస్తుశాఖ పరిధిలో ఉన్న సిద్దవటం కోటను మంగళవారం కలెక్టర్ శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. కోటలోని 1, 2 మండపాలు, కోట ముఖద్వారం, పార్కు, కామాక్షి ఆలయం, రాణి స్నానపు వాటిక, రాజు మహల్, రాణిమహల్, బిస్మిల్లా షావలి దర్గా, శివ లింగం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలోని శిల్పాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

మాధవరంలో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

సిద్దవటం, జనవరి 15 (ఆంధ్ర జ్యోతి): తన ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహరించుకు వెళ్లారని మాధవరంలోని పార్వతీపురం ప్రాంతానికి చెందిన పెంచలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు తన అత్త నరసమ్మ కడపలోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతుండడంతో ఆమెను చూసేందుకు శనివారం రాత్రి వెళ్లామని, సోమవారం ఉదయం తమ ఇంటి ఎదురుగా ఉన్న మల్లమ్మ ఫోన్ చేసి.. తమ ఇంటి తలుపులు తెరిచి ఉన్న విషయం తెలపడంతో 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సోమవారం పోలీసులు విచారణ చేపట్టగా.. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బచంద్ర తెలిపారు.

బైకును ఢీకొన్న కారు... యువకుడు మృతి



పోరుమామిళ్ల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లె సమీపంలో బుధవారం మోటారు బైకును కారు ఢీకొనడంతో సురేశ్ (25) యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పేరమ్మగారిపల్లెకు చెందిన సురేశ్ మోటారుబైకులో పోరుమామిళ్లకు వస్తుండగా కమ్మవారిపల్లె గ్రామ సమీపంలో బద్వేలు వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి చేరుకొని బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీ... వ్యక్తి మృతి



మదనపల్లె అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో సోమవారం రాత్రి పని ముగించుకుని అమ్మచెరువు మిట్టకు వెళుతున్న రామస్వామి (64)ని ఆటో ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. శవపరీక్ష కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రి మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. వన్‌టౌన్ వన్‌టౌన్ సీఐ ఎరిషావలి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృ తునికి భార్య లక్ష్మీదేవి, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు...

బి.కొత్తకోట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... బి.కొత్తకోట పట్టణం బెంగళూరు రోడ్డులోని బీసీ కాలనీలో నివాసం వుండే జరిపిటి కేశవ కుమారుడైన జరిపిటి గణేష్(24) చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా వుండేవాడు. సోమవారం సొంతపనుల నిమిత్తం కర్నాటక సరిహద్దున వున్న ఓ గ్రామానికి వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి పొద్దుపోయాక బి.కొత్తకోటకు ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణంలో ఠానామిట్ట చెక్‌పోస్టు వద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కింద పడటంతో తలకు గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరు కొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరి యా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పేర్కొన్నారు.

ఆటో-స్కూటర్ ఢీ... ఒకరు

రాయచోటి టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం జగనన్న కాలనీకి సమీపంలో బుధవారం సాయంత్రం ఆటో, స్కూటర్ ఢీకొన్న ప్రమాదంలో సిద్దిఖ్(23) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం శిబ్యాల గ్రామం కస్పాకు చెందిన అల్లాబకష్ కుమారుడు సిద్దిఖ్, శిబ్యాల నుంచి రాయచోటికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా జగనన్న కాలనీ సమీపంలోకి రాగానే రాయచోటి వైపు నుంచి ప్రయాణీకులతో వెళుతున్న ఆటో ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సిద్దిఖ్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఎమ్మెల్యే ఎదుటే టీడీపీ వర్గీయుల వాగ్వాదం



బ్యానర్‌లోని శ్రీనివాసులు ఫోటోను కాల్చిన దృశ్యం

చాపాడు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వి.రాజుపాళెం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఎదుటనే టీడీపీ వర్గీయులు ఒకరిపై మరొకరు తోసుకుని వాగ్వాదానికి దిగారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే వెదురూరు గ్రామానికి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఎమ్మెల్యే రాజుపాళెం గ్రామం వద్ద కొద్దిసేపు వాహనం నిలబెట్టారు. ఎమ్మెల్యేతో మాట్లాడటానికి వారు పోటీ పడ్డారు. ఈ నేపధ్యంలో రాజుపాళెం గ్రామానికి చెందిన పల్లెం శ్రీనివాసులు, గోర్ల సుబ్బరాయుడు, నరహరిపురం గ్రామానికి చెందిన నందిమండలం పవన్‌కుమార్‌రెడ్డిల మధ్య కొద్దిసేపు తోపులాట, వాగ్వాదం జరిగింది. పక్కనే ఉన్న ఇతర టీడీపీ నాయకులు ఘర్షణ జరుగకుండా సర్దుబాటు చేశారు. మళ్లీ సాయంత్రం నరహరిపురం గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ వర్గీయులు రాజుపాళెం గ్రామానికి వచ్చారు. మళ్లీ ఘర్షణ జరుగుతుందేమోనని విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్న పెద్దయ్య పోలీసు సిబ్బందితో వచ్చి వారిని చెదరగొట్టారు. అప్పటికే పల్లెం శ్రీనివాసులుకు చెందిన ఫొటోను బ్యానర్‌లో కాల్చివేశారు. ఎమ్మెల్యే ఫొటో గోర్ల సుబ్బరాయుడు, పసల రమణ, నరసింగు ఓబులేసు, ఇంకా కొంత మంది ఫొటోలను కలిగి ఉన్న బ్యానర్‌ను పూర్తిగా చించివేశారు. దీంతో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనలో గ్రామస్థులు ఉన్నారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ అడుగగా ఈ సంఘటన జరిగిన విషయం నిజమేనన్నారు. వారు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితాన్ని భరించలేక ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవికుమార్ సమాచారం మేరకు.. టి.సదుం పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు వెంకట్రమణ (50) భార్య ప్రమీల అనారోగ్యంతో 8 నెలల క్రితం ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందింది. ఆ తరువాత కుమార్తెకు వివాహం చేసి కుమారుడిని పోషించుకుంటూ ఒంటరిగా జీవిస్తూ ఉండేవాడు. సంక్రాంతి రోజు భార్య లేదని మనస్తాపం చెందాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది కాలనీ సమీపంలో ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

తిరుమలలో విషాదం

● భవనంపై నుంచి కిందపడి బాలుడి మృతి



తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం విషాదం చోటుచేసుకుంది. ఆడుకుంటూ భవనంపై నుంచి కిందపడి మూడేళ్ల బాలుడు మృతిచెందాడు. పోలీసులు, విజిలెన్స్ వివరాల మేరకు.. కడప జిల్లా చిన్నచౌక్‌కు చెందిన శ్రీనివాసులు, కృష్ణవేణి దంపతులు తమ ఇద్దరు కుమారులు నిహాంత్, సాత్విక్ శ్రీనివాసరాజు(3)తో కలిసి శ్రీవారి దర్శనార్థం 13న తిరుపతికి చేరుకున్నారు. 14వ తేదీ తిరుపతిలో 16వ తేదీకి సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు పొంది బుధవారం ఉద యం తిరుమలకు చేరుకున్నారు. ఈక్రమంలో తిరుమల ఆర్టీసీ బస్టాండ్‌లోని పద్మానాభ నిలయంలోని లాకర్‌ను పొందారు. తలనీలాల సమర్పణ అనంతరం వరాహస్వామిని దర్శించుకుని మధ్యాహ్నం తిరిగి లాకర్ వద్దకు చేరుకున్నారు. సాయంత్రం అన్న నిహాంత్‌తో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సాత్విక్ రెండవ అంతస్తులోని మెట్ల రైలింగ్ మధ్య ఖాళీ నుంచి కిందపడిపోయాడు. గుర్తించిన శ్రీనివాసుల దంపతులు వెంటనే తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. కాసేపటికే బాలుడు మృతి చెందాడు. బిడ్డ మరణంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. 2టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షల దరఖాస్తుల గడువు పొడిగింపు

కలికిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి కలికిరి సైనిక్ స్కూల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు పంపుకోవడానికి పది రోజుల గడువు పొడిగిస్తూ నేషనల్ టెస్టిం గ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నోటిఫికేషన్ జారీ చేసింది. సైనిక్ స్కూల్లో ఆరు, తొమ్మిదవ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న అర్హత పరీక్షలు రాయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు పంపుకోవడానికి ఈ నెల 13 గడువుగా ప్రకటించారు. తాజాగా ఈ గడువును ఈ నెల 23 తేదీకి పొడిగిస్తూ ప్రకటన జారీ చేసింది. దీనికి అనువుగానే గతంలో ఫీజు చెల్లించడానికి 14వ తేదీగా వున్న గడువును 24వ తేదీ రాత్రి 11.50 గంటలకు పొడిగించారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తుల్లో ఏవేనా లోపాలుంటే వాటిని సరిదిద్దుకోవడానికి కూడా గతంలో 16వ తేదీ నుంచి 18వ తేదీలోగా అవకాశమిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ కోసం కూడా 26 నుంచి 28వ తేదీలోగా సవరించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. కాగా విద్యార్థుల ఆధార్ కార్డు ఆధారంగా దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాల్లో అభ్యర్థి పేరు, ఫొటో, సంతకం, మొబైల్ నంబరు, ఈ-మెయిల్ ఐడీ, చిరునామాలు, పరీక్షా కేంద్రాలను మార్చుకోవడానికి మాత్రం అవకాశం లేదు. అయితే జండ ర్, పుట్టిన తేదీ, కేటగిరీ, మీడియమ్, తల్లిదండ్రుల పేర్లు మార్చుకోవడానికి అవకాశమిచ్చారు. ఇక ఆధార్ వివరాలతో లేని దరఖాస్తుల్లో కూడా పైవిధంగానే మార్పులు చేసుకోవడానికి అవకాశముంది.

అందుబాటులోని సీట్లు

కలికిరి సైనిక్ స్కూల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం అందుబాటులో వున్న సీట్ల వివరాలను కూడా ఎన్‌టీఏ వెల్లడించింది. ఈ స్కూల్లో మొత్తం ఆరవ తరగతిలో ప్రవేశాలకు 106, తొమ్మిదవ తరగతిలో ప్రవేశాలకు 16 సీట్లు అందుబాటులో వున్నాయి. ఇందులో ఆరవ తరగతిలో బాలికలకు 10 సీట్లు కేటాయించారు. తొమ్మిదవ తరగతిలో బాలికలకు ఒక సీటు మాత్రం అందుబాటులో వుంది. ఇవి కాకుండా ఎస్సీఎస్ నెల్లూరులోని ఆదాని వరల్డ్ స్కూల్లో (డే స్కూల్) ఆరవ తరగతిలో 80 సీట్లు, తొమ్మిదవ తరగతిలో 66 సీట్లు కూడా అందుబాటులో వున్నాయి.

పరీక్షా కేంద్రాలు

కలికిరి, కోరుకొండ సైనిక్ స్కూళ్లలో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే ప్రవేశ పరీక్షల కోసం అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, శ్రీకాకు ళం, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.

ఆణిముత్యాలు

● అంతర్జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో మెరిసిన యువక్రీడాకారిణులు ● బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు



జంప్‌రోప్ చాంపియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన భువనశ్రీ, ఆషియా

దువ్వూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయస్థాయి చాంపియన్ షిప్ పోటీల్లో యువ క్రీడాకారిణులు తమ సత్తా చాటి పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. ఆ యువ క్రీడాకారిణుల గురించి తెలుసుకోవాలంటే...

దువ్వూరు మండలంలోని రాంసాయినగర్ అనే మారుమూల గ్రామంలో భువనశ్రీ జన్మించింది. తల్లిదండ్రులు సాధారణ వ్యక్తులు. తండ్రి జీపు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. పేద కుటుంబంలో జన్మించిన భువనశ్రీ నంద్యాల జిల్లాలోని ఏపీఎం మోడల్‌స్కూలులో 8వ తరగతి చదువుతోంది. ఈ అమ్మాయి క్రీడలపట్ల ఆసక్తి కనపరచడంతో అక్కడి స్పోర్ట్స్ కోచ్‌లు షేక్ గౌస్, పక్కీరయ్య, వెంకటసుబ్బయ్య గమనించి.. జంప్‌రోప్ శిక్షణ అందించారు.

ఈ నేపధ్యంలో ఈనెల 6 నుంచి 8 వరకు నేపాల్‌లోని పోక్రా నగరం రంగశాల స్టేడియంలో ఇంటర్నేషనల్ స్థాయిలో లాంగ్‌రోప్ పోటీలు జరిగాయి. 30 సెకన్ల సైక్లింగ్ పోటీతో పాటు లాంగ్‌రోప్ (ఎల్ఆర్ఎస్) పోటీలో పాల్గొని రెండింటిలో గోల్డ్‌మెడల్స్ సాధించి.. ప్రశంసలు అందుకుంది. ఈ పోటీల్లో ఇండియా, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్ దేశాల నుంచి 22 విభాగాల్లో 1400 మంది ఆయా దేశాల్లోని ప్రతిభావంతులు పోటీ పడ్డారు. అందులో భువనశ్రీ రెండు బంగారు పతకాలు సాధించడం విశేషం.

జపాన్‌లో పోటీలకు ఆహ్వానం

జపాన్‌లోని కవాసకిలో జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనాలని భువనశ్రీకి ఆహ్వానం అందింది. అయితే ఈ అమ్మాయి తన కుటుంబానికి పేదరికం అడ్డు తగులుతోందని ఆవేదన వెలిబుచ్చుతోంది. తన తండ్రి సాయిప్రసాద్ సాధారణ బస్సు డ్రైవర్ అని, కష్టపడి తనను ఇంతవరకు ప్రోత్సహించారని తెలిపింది. జపాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొనాలంటే కనీసం రూ.3లక్షలు అయినా ఖర్చు అవుతుందని తన తండ్రికి అంతస్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దాతలు ప్రోత్సహిస్తే జపాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటానని ఆశాభావం వ్యక్తం చేసింది.

ఆషియాకు... పసిడి పతకాలు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇస్లామిక్ హైస్కూలుకు చెందిన 6వ తరగతి విద్యార్థి పి.ఆషియా అంతర్జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీల్లో తన ప్రతిభ చాటి పడిసి పతకాలు సాధించింది. ఈనెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు నేపాల్‌లోని పోక్రాన్‌లో జరిగిన 30 సెకన్ల సైక్లింగ్ పోటీతో పాటు లాంగ్‌రోప్ (ఎల్ఆర్ఎస్) పోటీలో రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఆ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షాహిద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు హసీనా, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా, ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో బంగారు పతకం సాధించింది.

షార్ట్ సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

పెద్దతిప్పసముద్రం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. సంపతికోట పంచాయతీకి చెందిన రెడ్డెప్పరెడ్డి (56) తన వ్యవసాయ పొలం వద్ద నీరు పెట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ మోటర్ వదిలే క్రమంలో స్టాటర్‌కు కరెంట్ పాస్ కావడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడన్నారు. రెడ్డెప్పరెడ్డి మృతిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రవికుమార్ పేర్కొన్నారు.

లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేతలు



ములకలచెరువు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌లను బుధవారం టీడీపీ నేతలు కలిశారు. నారావారిపల్లెలో ముఖ్యమంత్రి, మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, నాయకులు భజంత్రీ రామాంజులు, చాంద్‌బాషా, మూగి రవిచంద్ర, బుర్రారమణ, రెడ్డప్ప, సాయినాథ్, మారెప్ప, గంగాదేవి తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

ములకలచెరువు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. దేవలచెరువు పంచాయతీ రాజుగారిపల్లెకు చెందిన దేవరాజు కుమారుడు ధ్రువేక్ (5) ఇంటి వద్ద ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేసి కరిచాయి. ఈ ఘటనలో బాలుడు తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

23న భక్త కనకదాస్ జయంతి ఉత్సవాలు

మదనపల్లె, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కురబల కుల దైవం భక్త కనకదాస్ 537 జయంతి ఉత్సవాలు ఈ నెల 23న మదనపల్లె పట్టణం బైపాస్‌రోడ్డులోని రామతులసి కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం తన స్వగృహంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో కురుబ సేవా సంఘం మదనపల్లె డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి రమేష్, అడ్వకేట్ మనోహర్, నియోజకవర్గ అధ్యక్షుడు రాజన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో మకర సంక్రాంతిని పురష్కరించుకుని మదనపల్లె పట్టణం, నక్కలదిన్నెకు చెందిన బందార్ల వేణుగోపాల్ కుటుంబసభ్యులతో కలిసి భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిప్పిలి సర్పంచ్ చలపతి పాల్గొన్నారు. ఆలయంలో గత 10 ఏళ్లుగా సంక్రాంతి రోజున మంజునాథ్ జ్ఞాపకార్థం అన్నదానం నిరాటంకంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి



పెద్దమండ్యం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ బండెపురెడ్డిగారి పల్లిలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న రవి అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందినట్లు ఎంఆర్సీ సిబ్బంది హనీఫ్ తెలిపారు. చిన్నమండ్యం మండలం చాకిబండ గ్రామ పంచాయతీ కురవపల్లికు చెందిన రవి పెద్దమండ్యం మండలంలో గత 8 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల ఎంఈవోలు, మండల ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడు...



కలకడ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కలకడ-గుర్రంకొండ మార్గంలోని బుడ్డకాలువ వంకకు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన రామ్మోహన్ మృతి చెందాడు. హెచ్‌సీ రమేష్ బాబు వివరాల మేరకు.. రాతిగుంటపల్లె పంచాయతీ ఎగువబట్టావారిపల్లెకు చెందిన రామ్మోహన్ సొంత పనుల నిమిత్తం కలకడ వచ్చి తిరిగి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరుకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా పలువురు టీడీపీ నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

నేటి నుంచి రోడ్డుభద్రత మాసోత్సవాలు

మదనపల్లె అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఆర్టీసీలో ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15 వరకు రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ మేనేజరు రేవతి తెలిపారు. ఈ నెల రోజులు నిపుణులతో ఆర్టీసీ సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు

● కోలాహలంగా కనుమ పండుగ ● పలుచోట్ల చిట్లాకుప్ప దహనం ● ఉత్సాహంగా పార్వేట ఉత్సవం ● పీలేరులో ఆకర్షణగా నిలిచిన ఒంటె







పీలేరులో చిట్లాకుప్ప వద్ద ఎద్దును తరుముతున్న యువకులు, మదనపల్లెలో సంక్రాంతి సందర్భంగా అయ్యప్ప ఆలయంలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పీలేరులో చిట్లాకుప్ప వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఒంటె

సంక్రాంతి సంబరాల్లో భాగంగా మూడవ రోజు కనుమ పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ క్రమంలో వాడవాడలా చిట్లాకుప్పలు, పార్వేట ఉత్సవాలు నిర్వహించారు. పలుచోట్ల ఆవులు, ఎద్దులను అలంకరించారు. ప్రతి ఇంటి ముందు అందమైన ముగ్గులు వేయడంతో కనువిందు చేసింది. సంక్రాంతికి ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ సొంతూర్లకు చేరుకోవడంతో సందడి వాతావరణం చోటుచేసుకుంది. ఇక పండుగ ముగియడంతో ఆయా ఊర్లకు తరలివెళ్లారు.

పీలేరు/మదనపల్లె/బి.కొత్తకోట/నిమ్మనపల్లె/కురబలకోట/తంబళ్లపల్లె/ములకలచెరువులో/గుర్రంకొండ/కలకడ/వాల్మీకిపురం/కలికిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ పండుగను బుధవారం ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. పెద్ద పండుగైన సంక్రాంతికి ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ సొంతూర్లకు చేరుకోవడంతో సందడి వాతావరణం చోటుచేసుకుంది. పీలేరు పట్టణంలో కామాటంవారిపల్లె, కట్టుకాలువ వీధి, కావలిపల్లె ప్రాంతాల్లో బుధవారం చిట్లాకుప్ప కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. పీలేరు పట్టణంలోని రైతులు, పశువుల యజమానులు తమ పశువులను సుందరంగా అలంకరించుకుని ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన చిట్లాకుప్పల వద్దకు తోడ్కొని వచ్చారు. చిట్లాకుప్పకు హాజరయ్యే వారి కోసం ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన ఎద్దుల అలంకరణ, మ్యూజికల్ చైర్స్, గాలి పటాల ఎగరేత పోటీల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి చాలా మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచేలా చిట్లాకుప్ప దహన కార్యక్రమంలో పట్టణంలోని ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కావలిపల్లెలో జరిగిన వేడుకల్లో కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పీలేరు మండలం దొడ్డిపల్లె పంచాయతీ కొత్తపేటకు చెందిన కొంత మంది యువకులు తమ అభిమాన హీరో, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రాలతో తమ పాడిని ప్రత్యేకంగా అలంకరించుకుని కామాటంవారిపల్లె చిట్లాకుప్ప వద్దకు రాగా అక్కడ అవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిట్లాకుప్ప వద్దకు వచ్చిన ఒంటె మీద సవారీ చేసేందుకు చిన్నారులు ఎగబడ్డారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కామటరాజు ఆలయ ధర్మకర్తలు పోతంశెట్టి ప్రభాకర, పోతంశెట్టి రమేశ్, శ్రీకృష్ణం చందు, శ్రీరామ కనకరాజా, కె.శ్రీనివాసమూర్తి, ఉత్సక కమిటీ సభ్యులు మనోహర, మోహన, పిక్కా రమణ, జ్ఞానంగారి శ్రీధర్, వీవీ రమణ, చలపతి, మనోహర, బళ్లారి రామ్మూర్తి, ప్రసాద్, పవన్, జ్ఞాన, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో...

మదనపల్లె పట్టణం, రూరల్ మండలంలో పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. అలాగే చిప్పిలి గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం బసినికొండమీద కుర్పూరంతో వెలుగునిచ్చి మకర సంక్రాంతి అయ్యప్ప జ్యోతిదర్శనం భక్తులకు కల్పించారు. సాయంత్రం అయ్యప్ప స్వామిని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా దర్శించుకున్నారు. ఆలయంలో తిరుమల, తిరుపతి అన్నమాచార్యుల ట్రస్టు ఆధ్వర్యంలో సంగీత కచ్చేరి నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందించారు. కోలాటాలు, చెక్కభజనలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా మడికయ్యల శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వర స్వామి గోపూజ నిర్వహించారు. భక్తులకు యోగభోగేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరణ చేసి దర్శినం కల్పించారు. చీకలబైలు గ్రామంలో బార్లపల్లె, చొక్కాండ్లపల్లె, జ్యోలిపాళెం, మేడిపల్లె, తదితర ఊళ్లల్లో కనుమ పండుగను వైభవంగా నిర్వహించారు.

అలాగే బి.కొత్తకోట మండలంలో సంక్రాంతి పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇక నిమ్మనపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సక్రాంతి పండుగను బుధవారం గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా నిమ్మనపల్లి వెంకోజిగారిపల్లి, చల్లావారిపల్లి, బండ్లపై, అగ్రహారం, బండమీద మాలపల్లి, ఆరిపిరెడ్డిగారిపల్లెలో ఆవులను, ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కురబలకోటలో.. మండలంలోని పలు గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మండల పరిధిలోని తెట్టు, అంగళ్లు, ములకవారిపల్లె, ముదివేడు తదితర గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. తంబళ్లపల్లెలో... కనుమ పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిట్లాకుప్పకు నిప్పు పెట్టి పశువులను చిట్లాకుప్ప చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ములకలచెరువు మండలంలో.. మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇళ్ల ముందు రంగులతో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. పిల్లలు గాలిపటాలు ఎగురవేశారు. అలాగే కనుమ సందర్భంగా పశువులను అలంకరించి గ్రామాల్లో ఊరేగించారు. గ్రామాల్లో సందడి నెలకొంది. గుర్రంకొండలో.. సంక్రాంతి పండుగను మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా పశువులను ప్రత్యేకంగా అలంకరించి చిట్లా కుప్పల వద్దకు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఇళ్ల ముందు పాలు పొంగలు చేశారు. అనంతరం ఎద్దులు, పాడి ఆవులను చెరువుల వద్ద తోలుకెళ్లి శుభ్రం చేశారు. కలకడ మండలంలో... కనుమ పండుగను మండల ప్రజలు బుధవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణాల్లో స్థిరపడిన వారు స్వగ్రామాలకు రావడంతో పల్లెలో సందడి వాతావరణం నెలకొంది. రైతులు వారి జీవనాధారమైన పశువులను ప్రత్యేకంగా అలంకరించి వైభవంగా ఊరేగిస్తూ చిట్లకుప్ప వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం చిట్లా కుప్ప వద్ద కాటమ రాజుకు మహిళలు ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఇక కలికిరి మండలంలో... బుధవారం మండలంలోని నగరిపల్లె, పారపట్ల, నర్రావాండ్లపల్లె, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. స్వగ్రామం నగరిపల్లెలో కనుమ పండుగ వేడుకల్లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. పశువుల బీడుల వద్ద చిట్లా కుప్పలను పేర్చి నిప్పు పెట్టి పశువులను బెదిరించే సాంప్రదాయాన్ని కొనసాగించారు. వాల్మీకిపురం మండలం వ్యాప్తంగా మంగళవారం సంక్రాంతి పండుగ వేడుకలను ప్రజలు ఎంతో వైభవంగా జరుపుకున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు చేరుకున్న ఉద్యోగులు తమ కుటుంబాలతో కలిసి గ్రామాలలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాటమరాజు పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. వాల్మీకిపురం పట్టణంలో సాంప్రదాయం మేరకు గురువారం కాటమరాజు వేడుకలు జరగనున్నాయి. పశువులకు అలంకరణలు, కాటమరాజు వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు.









మదనపల్లె మండలం కోళ్లబైలులో ఇంటిముంగిట్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న ఓ కుటుంబం, కలికిరి నర్రావాండ్లపల్లెలో మండుతున్న చిట్లా కుప్ప, బి.కొత్తకోట... అచ్చమ్మకోటలో సింగారించిన ఆవులతో యువతులు, వాల్మీకిపురంలో కనుమ వేడుకల్లో రైతులు, గ్రామస్థులు

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పట్టాభిరామాలయంలో మంగళవారం టీడీడీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ మొదలు మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం భోగోత్సవ మూర్తులైన సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడికి విశేషాలంకరణలు గావించి ఆలయ మండపంలో మామిడి తోరణాలు, పుష్పాలంకరణలతో తీర్చిన కల్యాణ వేదికపై ఆశీనులు గావించారు. మంగళవాయిద్యాల ఘోష, వేదపండితుల మంత్రోచ్చరణలు, విశేష భక్తజనం నడుమ సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. సాయంత్రం సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను తిరుచ్చిలో అలంకరణలు గావించి పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు అనిల్ కుమార్, భక్తులు పాల్గొన్నారు.



వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జాతీయ యువజనోత్సవాల్లో నృత్యప్రదర్శన



జానపద నృత్యప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

మదనపల్లెటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ యువ జనోత్సవాల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున మదనపల్లె శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ నెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో భారత్ మండపంలో దేశవ్యాప్తంగా వచ్చిన అన్ని రాష్ట్రాల జట్లు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆంధ్రరాష్ట్రం తరఫున జ్ఞానాంబిక విద్యార్థినులు లంబాడి జానపద నృత్యప్రదర్శన ఇచ్చారు. వీరి నృత్యాన్ని మెచ్చుకున్న కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు, ఎయిర్‌పోర్ట్సు ఆఫీసర్ క్లబ్‌లో మరోసారి విద్యార్థినులతో నృత్య ప్రదర్శన ఇప్పించారు. ప్రతి విద్యార్థినికి కేంద్రం ప్రత్యేక విందు ఇచ్చి, బహుమతులు అందజేశారు. అంతేకాకుండా అమలాపురం ఎంపీ జీఎం హరీష్‌మాధుర్ కూడా తన క్యాంపు కార్యాలయం వద్ద విద్యార్థినులతో నృత్య ప్రదర్శన ఇప్పించారు. ఈ కార్యక్రమంలో డాన్స్‌మాస్టర్ సురేష్, డప్పు మాస్టర్లు రామ్మోహన్, నాగరాజు పాల్గొన్నారు. బుధవారం మదనపల్లెకు చేరుకున్న విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు.

సంక్రాంతి విశిష్టతను తెలియజేయాలి

మదనపల్లెటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో సంస్కృతి, సాంప్రదాయాలను మరచిపోతున్న యువతకు సంక్రాంతి పండుగ విశిష్టత గురించి తెలియజేయాలని కురవంక సర్పంచ్ చలపతి పేర్కొన్నారు. మంగళవారం కురవంక, కోళ్లబైలు గ్రామ పంచాయతీల్లో నవజీవన్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, భగత్‌సింగ్ యూత్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పతంగుల, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో నెగ్గిన విజేతలకు చలపతి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు రాధామణి, భాగ్యలక్ష్మి, జి.పద్మావతమ్మ, పూజిత, భరత్ పాల్గొన్నారు.

డ్రైవర్‌పై మూకుమ్మడి దాడి

మదనపల్లె అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): టాటా ఏస్ డ్రైవర్‌కు ఫోన్ చేసి బాడుగ విషయం మాట్లాడాలని పిలిపించి అతనిపై ముగ్గురు దాడి చేసిన ఘటన సీటీఎం శివారు ప్రాంతంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తాలుకా సీఐ వివరాల మేరకు.. సీటీఎంకు చెందిన పి.ఆంజనేయులు(45) టాటా ఏస్ వాహనంతో బాడుగకు వెళుతుంటాడు. ఈ క్రమంలో అదే ఊరుకు చెందిన సునీల్, నీల్, మహేష్‌లు బాడుగకు రావాలని సీటీఎం శివార ప్రాంతమైన సప్తలమ్మ ఆలయం వద్దకు ఉద్దేశ్యపూర్వకంగా రమ్మన్నారు. అక్కడికి వెళ్లిన ఆంజనేయులుపై ఆ ముగ్గురు మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చి, దుర్భాషలాడారు. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. బుధవారం బాధితుడి భార్య ప్రమీల ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

మదనపల్లెటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని గోవర్ధననగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద గోవర్ధననగర్‌కు చెందిన మహిళలు తాగునీటి సమస్యపై ఏకరువు పెట్టారు. తమ కాలనీలో పది రోజులుగా తాగునీటి సమస్య వుందని, ప్రైవేటు ట్యాంకర్లతో నీటి కొనుగోలుకు అధికంగా డబ్బులు వెచ్చించాల్సి వస్తోందని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి 24 గంటల్లో గోవర్ధన నగర్‌లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండలంలోని రామాచార్లపల్లె, గంగన్నగారిపల్లె గ్రామాల్లో కనుమ పండుగ సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అదేవిధంగా సంక్రాంతి పండుగకు తిరుపతి జిల్లా నారావారిపల్లెకు వచ్చిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మర్యాద పూర్వకంగా కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ ఉన్నారు.

కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం



కల్యాణ తంతు జరుగుతున్న దృశ్యం

పీలేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో బుధవారం గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ రోజున పీలేరులో ప్రతి ఏడాదీ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం జరిపించడం ఆనవాయితీ. ఈ క్రమంలో స్థానిక నెహ్రూ బజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోని గోదాదేవి, రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ఆర్యవైశ్య సంఘ సభ్యులు బుధవారం పట్టణ వీధుల్లో ఊరేగింపుగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపానికి తరలించారు. అక్కడ వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి స్వామివారు కల్యాణ ధారణ చేశారు. అనంతరం చిన్నారులకు భగవద్గీత, మహిళలకు కోలాటం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ మహిళా సంఘం, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వేడుకగా మకరజ్యోతి వేడుకలు



అయ్యప్పస్వామి నగరోత్సవం

వాల్మీకిపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి రోజున అయ్యప్పస్వామి మకర జ్యోతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక కోనేటివీధిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణలు గావించి మాల ధరించిన భక్తుల కోలాహలం నడుమ పట్టణ పురవీధులలో నగరోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్థానిక కొత్త ఇందిరమ్మ కాలనీ నల్లగుట్ట ప్రాంతంలో అయ్యప్పస్వామి అఖండ జ్యోతి వెలిగించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ గురుస్వాములు రామచంద్ర, శ్రీరాములు, శీనా, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ములకలచెరువు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు ఆటో, హమాలీ వర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పేర్కొన్నారు. ములకలచెరువులో బుధవారం ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణ కార్మికులకు, ఆటో హమాలీలకు సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.